క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ కోర్టులో సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని క్రిమినల్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని న్యాయమూర్తి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి

పొన్నూరు: ప్రస్తుత పరిస్థితులలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి ఖర్చులను తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎవో పాల్గొని పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కురుస్తున్న అధిక వర్షాలతో పంట దెబ్బతినకుండా బీజామృతం చేపమందు కషాయం వినియోగించడం వలన పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. దీనికి ఎకరానికి రూ. 200 మాత్రమే ఖర్చవుతోందని, కావాలంటే అందిస్తామని అన్నారు. చిరుధాన్యం సాగును ప్రోత్సహించాలని వీటికి మద్దతు ధర లభిస్తుందన్నారు. రసాయనిక ఎరువులను వీడి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వాడి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. అశోక్, వ్యవసాయ సహాయకులు ఏ. భావన, ఎంపీఈఓలు వి.భానురేఖ, ఎస్. సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకం ప్రయోజనాలపై అవగాహన

పెదకాకాని: జీవన ఎరువుల వాడకం ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సునీత అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు రైతు సేవ కేంద్రంలో గురువారం రైతు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు భూములు వాటి యొక్క ఆరోగ్యం, జీవన ఎరువుల వాడకం వలన కలిగే లాభాలు, చౌడు భూములు పునరుద్ధానం గురించి వివరించారు. మండల ఏఓ రమణకుమార్ మాట్లాడుతూ మండలంలో 11000 ఎకరాలు వరి సాగు చేస్తున్నార న్నారు. వరికి కావలసిన ఎరువులు రైతు సేవ కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు.యూరియా నిల్వలు సంపూర్ణం గానే ఉన్నాయని, ఇప్పటికే మండలంలో 1300 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకి సరఫరా చేయడం జరిగిందన్నారు. అనంతరం 60 మంది రైతులకు శిలీంద్ర బ్యాక్టీరియా నాశిని అయిన సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్ మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు




గుంటూరు రూరల్: మండలంలోని మల్లవరం గ్రామం నందున్న ఎంపీపీ పాఠశాలలో గురువారం ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు మంచి ఆరోగ్యం కోసం తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వివిధ ప్రశ్నోత్తరాలు నిర్వహించి విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

గుంటూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రూరల్ మండలంలో ప్రతి గ్రామంలో తాగునీరు కలుషితమై మురికిగా సరఫరాల అవుతున్నాయని పంచాయతీ అధికారులు స్పందించి తాగునీరు కలుషితమవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రూరల్ మండలం అధ్యక్షుడు నేలపాటి ఏసుబాబు గురువారం తెలిపారు. ఎడతెరపి లేకుండా బారీగా కురుస్తున్న వర్షాల వల్ల త్రాగునీటిలో డ్రైనేజ్ లీకేజీల వద్ద మురికి నీరు కలిసి సరఫరా అవుతున్నాయని దీని ద్వారా ప్రజలు విషజ్వరాలతో ఇంటికి ఒకరు ఇద్దరు మంచాన పడుతున్నారన్నారు. ప్రతి ఇంటిలో టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఫీవర్లతో ప్రజలు నరకం చూస్తున్నారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 65 సంవత్సరాలు వయసుగల వ్యకిత ఏటుకూరు బైపాస్ రోడ్డు ఏరియాలో అనారోగ్యముతో పడిపోయి ఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది అతనిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు మేమయ్యా...

- వాడవాడలా పార్వతీ నందనుడికి పూజలు
- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణనాథుడికి అర్చన



నల్లపాడు గ్రామంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గుంటూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రజలు వినాయకుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ కోరుకున్నారు. బుధవారం ఏటుకూరు బైపాస్‌రోడ్డులోని నియోజకవర్గం కార్యాలయంలో వినాయకచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నల్లపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఆశీస్సులతో విఘ్నాలు తొలగి విజయం సాధించాల ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారతినగర్‌లో...

స్వర్ణభారతినగర్ 41వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుతో కలిసి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకచవితి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ మండలం, స్వర్ణభారతినగర్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చేబ్రోలులో...

చేబ్రోలు: మండలంలో వినాయకచవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా చలువ పందిళ్లు వేసి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని కూడలి ప్రాంతాల్లో భక్త బృందాలు ఆకర్షనీయమైన భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంది. ఆయా చోట్ల వినాయక విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు వంద వరకు చిన్న, పెద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కురుస్తున్నప్పటికి చవితి పండుగను భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు.

పెదకాకానిలో...

పెదకాకాని: పూజా క్రతువులో ప్రథమ పూజలందుకునే విఘ్నేశ్వరుని చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామంలో బుధవారం వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని పందిళ్ళను మామిడాకు తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయానే పూజా ఘట్టంలో ప్రముఖమైన పత్రి సేకరించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని పూజ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. కొబ్బరికాయలు, పూలు, పండ్లు, ఉండ్రాళ్ళు, పాయసము, వడపప్పు వినాయకునికి సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. మండలంలోని నంబూరు, కొప్పురావూరు, వెనిగండ్ల, అగతవరప్పాడు,పెదకాకాని గోళ్ళమూడి, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, రామచంద్రపాలెం, వెంకటకృష్ణాపురం, అనుమర్లపూడి గ్రామాల్లో వినాయక చవితి పందిళ్లు వేసి చవితి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. వినాయక విగ్రహాలను బుధవారం సాయంత్రం, గురువారం ట్రాక్టర్ల పైకి చేర్చి అలంకరించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ముఖ్యంగా తీన్‌మాస్ డబ్బులు, కనక తప్పెట్లు, కోలాటాలు, కోలాటాలు,డిజె సౌండ్‌లు, క్రాకర్స్‌తో కోలాహలంగా సాగింది. ముఖ్యంగా చవితి వేడుకల నిర్వాహకులు, యువత, కమిటీ కుర్రోళ్ళు, యూత్‌ల నుంచి స్టెప్‌లు వేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కొందరు రెండవరోజు నిమజ్జనానికి వినాయకుని తరలించగా, మరికొందరు 3వ రోజు, మరికొందరు 5 రోజు వినాయకుని నిమజ్జనానికి తీసుకు వెళతారు. అలానే 2వ రోజు నుంచి 15 రోజు వరకూ పందిళ్ళలో పూజలు చేసి నిమజ్జనానికి తీసుకు వెళుతూ ఉంటారు. పూజలు జరిపించి తొలిరోజు పూజలు చేసిన నిర్వాహకులు రెండవ రోజు గురువారం వినాయక చవితి నిమజ్జనానికి సమీపంలో చెరువులు, పంట కాలువలకు తరలివెళ్ళారు.



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో..


పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద అంగరంగ వైభవంగా జరుగుతున్న గణేష్ ఉత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఏఎన్‌యూ వద్ద గురువారం జరిగిన పూజా కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయం రిజిస్టర్ సింహాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్టార్ మాట్లాడుతూ యావత్ భారత దేశ ప్రజానీకానికి స్ఫూర్తినిచ్చే విధంగా మన నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు మట్టి బొమ్మను ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. కులాలకతీతంగా మతాలకతీతంగా మనమంతా ఒకటే అనేటువంటి భావని ఎటువంటి గొడవలు ఇబ్బందులు లేకుండా విశ్వవిద్యాలయంలో జరుపుకోవడం విద్యార్థుల్లో ఉన్నటువంటి ఐక్యతకి నిదర్శనమన్నారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రత్యేక పూజలు భాగంగా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ దంపతులు పాల్గొని ఆ గణనాధునికి పూజలు నిర్వహించారు, ఏఎన్‌యూ దూర విద్యా కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎం త్రిమూర్తిరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్య తేజమూర్తి, బాలుర, బాలికల చీఫ్ వార్డెన్స్, ప్రొఫెసర్. మల్లికార్జున్, డాక్టర్ మాధవి, ప్రొఫెసర్ ధనలక్ష్మి, సి.ఎస్ఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, డాక్టర్ దేవకాంత్, డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సత్య, వికాస ప్రెసిడెంట్ ప్రసాద్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వర్ణభారతినగర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఇన్‌చార్జ్ బలసాని కిరణ్



చేబ్రోలు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం



చేబ్రోలులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



మంచాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



వెనిగండ్ల నుంచి నిమజ్జనానికి బయలు దేరిన వినాయకుడు

దీపక్ కుటుంబాన్ని పరామర్శించిన మురళీకృష్ణ

చేబ్రోలు: జీఎస్టీ ఆఫీసర్ పిల్లి దీపక్ కొద్ది రోజుల క్రితం ఆకస్మికంగా మరణించటంతో వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ గురువారం పరామర్శించారు. చేబ్రోలు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి శశిదేవి కుమారుడు పిల్లి దీపక్ గుంటూరులో జీఎస్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ దీపక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లి శేషిరెడ్డి, యాతం మమత, అల్లం వెంకట్రామయ్య, హరికృష్ణ, పి.కోటేశ్వరరావు, పోలేశ్వరరావు, సుశీలరావు, ఖాజా, దాసరి దానమ్మ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

హ్యాకథాన్ పోటీలకు ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులు

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాలను ఆకర్షించేలా అమరావతి క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి విద్యార్థులు అద్భుత సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారంచుట్టి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్న ఆవిష్కరణ ఆంధ్ర విజన్‌ను విజయవంతం చేయాలని ప్రముఖ సాంకేతిక నిపుణులు ప్రొఫసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీలకు ప్రపంచ కేంద్రంగా అమరావతిని మార్చాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి, కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతిక విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో సృజనాత్మక పరిష్కారాలను చూపడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారతదేశ ఇన్నోవేషన్ శక్తిని ప్రపంచానికి పరిచయం చేసే ప్రధాన వేదిక కానుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. ఇలాంటి సాంకేతిక పోటీలు విద్యార్థుల సమస్య పరిష్కార నైపుణ్యాలను, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఏ శ్రీనగేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొనే విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మంచి నడవడికతోనే విజయావకాశాలు

వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: మంచి నడవడికతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని వీవీఐటీయూ విశ్వసిస్తుందని యూనివర్సిటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. నంబూరు వీవీఐటీయూలో నిర్వహించిన 2025-26 విద్యా సంవత్సరం మొదటి ఏడాది విద్యార్థుల తరగతుల ప్రారంభ కార్యక్రమములో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈఏస్ సెట్ 2025లో టాప్ ర్యాంకర్లగా నిలిచి, విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లడుతూ క్రమశిక్షణలో కూడిన అధునాతన విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటుగా విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను వివిఐటి విశ్వవిద్యాలయం అందిస్తుందన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయంగా ప్రకటించిన వెంటనే విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. వారి నమ్మకం మాపై మరింత బాధ్యత పెంచిందన్నారు. వీవీఐటీ విశ్వవిద్యాలయం లోకమంతటా ప్రసిద్ధి చెంది మా విద్యార్థులు, మేము వీవీఐటీయూ విద్యార్థులు గర్వంగా చెప్పుకోగలిగేంత వరకూ విశ్రమించమన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు, సీమన్స్ ఎక్సెలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం వలన విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణా పద్ధతులు అవలంభించేందుకు, వారిలోని విలువలను పెంపొందించేందుకు వీవీఐటీయూ దోహదపడుతుందన్నారు. వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్. సెక్రటరి సూర్యదేవర బదరిప్రసాద్, అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు, విభాగాధిపతులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చదువుల తల్లికి పూజలు చేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

మలినేనిలో క్వాంటంవ్యాలి ఇంటర్‌నల్ హ్యాకథాన్ పోటీలు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అమరావతి క్వాంటం వ్యాలీ ప్రోగ్రాంకు మద్దతుగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినులలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనాత్మక ఆలోచనలు భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ హ్యాకథాన్‌పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మలినేని సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్లు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని అత్యంత అధునాతన సాంకేతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మలినేని విద్యార్థినులు పాల్గొని కాలేజీ పేరుతొ పాటు వారి కెరీర్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి హ్యాకథాన్‌లు విద్యార్థినుల భవిష్యత్తునీ మరింత ఉజ్వలంగా ఉండేటట్లు చేస్తాయన్నారు. డీన్ పి.రమేష్ మాట్లాడుతూ విద్యార్థినులను భవిష్యత్తు సాంకేతికతలకు సిద్ధం చేసి మలినేని మహిళా ఇంజనీర్లను టెక్నాలజీ రంగంలో ముందంజలో నిలబెట్టే దిశాగా కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మొత్తం 25 జట్లు పాల్గొనగా ప్రాజెక్టులను పరిశీలించి 5 జట్లులను విజేతలుగా ఎంపిక చేశారు. విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రామస్వామి, అడిసిన్ఫోటెక్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల యాజమాన్యం

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

చేబ్రోలు: చేబ్రోలులో ఆదాని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఆగస్టు 28వ తేదీ 2000 సం.లో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద గుర్రాలతో తొక్కించి పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు డి లక్ష్మీ నారాయణ, తదితరులు అమరవీరులకు నివాళులు అర్పించారు. బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాల స్వాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీ ఆపకపోతే మరొకసారి విద్యుత్ ఆందోళనకు ప్రజలు సిద్ధం కావలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హనుమంతరావు, మస్తాన్‌వలి, చోటు, మహేంద్ర, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వహీద్ చౌక్ వద్ద గుర్రాలతో తొక్కించి పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఎం, సీపీఐ వామపక్షాల ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత ప్రభుత్వ విధానాల వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం తృణ ప్రాయంగా ప్రాణాలర్పించిన పోరాట వీరులకు విప్లవ జోహార్లు, మీ త్యాగాలను వృథా కానివ్వమన్నారు. మీరు చూపిన పోరాట బాటలో రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్న మోడీ ఆదాని అను కూల విద్యుత్ సంస్కరణలు పెంచిన విద్యుత్ చార్జీలు ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. నేతాజీ మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపే స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను ప్రజలు ప్రతిఘటించాలన్నారు. కార్పొరేట్ కంపెనీ అధినేత ఆదానీ గ్రూపుకి సంబంధించిన స్మార్ట్ మీటర్లు బిగించేటువంటి ఒప్పందాన్ని అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు, అదానీ గ్రూప్ కంపెనీకి మన రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించేటువంటి ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనివల్ల ప్రజలపై అధిక భారాలు పడి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఎన్నికల ముందు ప్రజలపై విద్యుత్ బారాలు మోపబోమని హామీ ఇచ్చినటువంటి కూటమి ప్రభుత్వం సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో ఆర్థిక భారాలు ప్రజలపై మోపుతుందన్నారు. ఈ విధానం మొబైల్ ఫోన్ రీఛార్జి చేసినట్లుగా ముందే డబ్బులు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని బిల్లు వచ్చిన తర్వాత చెల్లించే విధానం రద్దవుతుందన్నారు. ఉదయం ఒక రేటు సాయంత్రం ఒక రేటు చొప్పున అధిక భారాలు ప్రజలపై మోపడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడ్డాయన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.బాబురావు, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఎస్.నీలాంబరం, కె.రాఘవయ్య, రాము, మహిళ జిల్లా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, కేతినేని అగస్టీన్, రామిశెట్టి శ్రీనివాసరావు, దర్శిలింగారావు, సి.హెచ్.విజయలక్ష్మి, నౌడు సత్యనారాయణ, పున్నారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు

విజ్ఞాన్ నిరులలో క్వాంటమ్ వ్యాలీ అంతర్గత హ్యాకథాన్

గుంటూరు రూరల్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న అమరావతి క్వాంటంవ్యాలి హ్యాకథాన్ -2025లో గురువారం కార్యక్రమంలో భాగంగా కళాశాలలో అంతర్గత హాకథాన్ నిర్వహించినట్లు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో ఐదు జట్లు 30 మంది విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. రెండు జట్లను ఎంపిక చేసిన సెప్టెంబర్ 8వ తేదీన జరగనున్న సెమీఫైనల్‌కు పంపుతున్నట్లు తెలిపారు. క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవం కలిగిన ఇద్దరు ఐటీ రంగ ప్రతినిధులు పోటీలకు జడ్జిలుగా వ్యవహరించినట్లు తెలిపారు. సెమీఫైనల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందనలు తెలిపారు.

